క్లుప్తంగా

ఓటీఎస్ పట్టాల పంపిణీ



మచిలీపట్నంటౌన్: 31వ డివిజన్ శారదా నగర్‌లో ఎనిమిది మంది లబ్ధిదారులకు ఓటీఎస్ పట్టాలను కార్పొరేటర్ యంత్రపాటి నాగేశ్వరరావు గురువారం అందజేశారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆదేశాల మేరకు శారదా నగర్ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు వీటిని అందజేశామని నాగేశ్వరరావు తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో ఆదాయం



కృత్తివెన్ను: పోషక విలువలున్న ఆహారం కోసమే పెరటికోళ్ల పెంపకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటికోళ్లను గురువారం అందజేశారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలతో పాటు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యం కోసం పోషకాహారం అవసరమన్నారు. పెరటికోళ్ల పెంపకంతో పోషక విలువలు కలిగిన గుడ్లు ఆహారంగా తీసుకోవచ్చని చెప్పారు. ఒక్కో యూనిట్ ధర రూ. 3,970 చెల్లించిన వారికి మూడు కోడి పుంజులు, 8 కోడిపెట్టలను అందజేశారు. వీటి పెంపకం ద్వారా ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, సీసీ సత్యవర్ధన్ పాల్గొన్నారు.

ఐదుగురికి ట్రై సైకిళ్లు అందజేత



పురిటిగడ్డ (చల్లపల్లి): దివ్యాంగులు ఐదుగురికి ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లు అందించారు. గురువారం పురిటిగడ్డలో ఐవీఎం సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ దాతృత్వంతో ఒక్కొక్కరికీ రూ.15 వేలు విలువైన ట్రై సైకిళ్లు అందించారు. చల్లపల్లికి చెందిన తటవర్తి భాస్కరరావు, పాగోలుకు చెందిన పైడిపాముల వెంకయ్య, నడకుదురుకు చెందిన డొక్కు సోమరాజు, మోపిదేవికి చెందిన చెన్ను శ్రీనివాసరావు, చెన్ను కోటేశ్వరరావులకు వీటిని అందచేశారు.

పీఏసీఎస్ అధ్యక్షుడి నుంచి ఎమ్మెల్సీగా ఎదిగిన బచ్చుల



మచిలీపట్నంటౌన్: ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు తన రాజకీయ ప్రస్థానంలో అంచెలంచెలుగా ఎదిగారు. టీడీపీ ఆవిర్భావం నాటి నుంచి ఆ పార్టీలోనే కొనసాగారు. మునిసిపల్ వార్డు టీడీపీ అధ్యక్షునిగా పనిచేసిన ఆయన 1995 నుంచి 2000 సంవత్సరం వరకు బందరుకోట శ్రీ వేణుగోపాలస్వామి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో కేడీసీసీ బ్యాంక్ ఉపాధ్యక్షునిగా కూడా పనిచేశారు. 2000 సంవత్సరం నుంచి 2005 వరకు మచిలీపట్నం మునిసిపల్ చైర్మన్‌గా, 2014లో టీడీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2017లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ నెలాఖరుకు ఆయన ఎమ్మెల్సీ పదవీకాలం ముగియనుంది. ఆయన మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

ఇస్మాయిల్‌బేగ్ పేటలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభం

కోడూరు: ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం ప్రారంభించారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు భవనం లేకపోవడంతో ఇప్పటివరకు కోడూరులోని ఉర్దూ పాఠశాల భవనంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు తరగతులు బోధించారు. ఉర్దూ పాఠశాల విద్యార్థులకు దూరం కావడంతో తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఎంఈఓ టీవీఎం రామదాసు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎంఈఓ గ్రామంలోని ఆర్థిక సమతా మండలి స్వచ్ఛంద సంస్థకు చెందిన ఖాళీ భవనంలో పాఠశాల నిర్వహణకు సంస్థ సభ్యుల వద్ద అనుమతి తీసుకున్నారు. దీంతో ఈ భవనంలో ఇస్మాయిల్‌బేగ్ పేట ఎంపీపీ పాఠశాలను రమేష్‌బాబు ప్రారంభించారు. సంస్థ సభ్యులను, విద్యాశాఖ అధికారుల చొరవను ఎమ్మెల్యే ప్రశంసించారు. సంస్థ ప్రతినిధులు సత్యనారాయణ, ప్రమీల, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యం మరింత చేరువ

- తుది దశకు పట్టణ ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మాణం
- మరో రూ.14 లక్షల నిధుల కోసం ప్రతిపాదనలు
- ఏప్రిల్‌లోగా ప్రారంభోత్సవం జరిగే అవకాశం



తుది దశకు చేరిన పట్టణ ఆరోగ్య కేంద్రం నూతన భవనం

పెడన: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసింది. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా కార్పొరేట్ తరహాలో వైద్యం అందిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పేరుతో వైద్యులను ఇంటింటికీ పంపించి వైద్య సేవలను చేరువ చేసింది. వైద్యశాలలకు నూతన భవనాలను నిర్మించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పెడన అర్బన్ హెల్త్ సెంటర్ (పెడన పట్టణ ఆరోగ్య కేంద్రం) నూతన భవనం నిర్మాణానికి రెండున్నరేళ్ల కిందట ప్రణాళికలు రూపొందించి నిధులు విడుదల చేసింది. వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నుంచి రూ.80 లక్షల నిధులు విడుదల చేశారు. దీంతో పనులు ప్రారంభించడంతో ప్రస్తుతం పట్టణ ఆరోగ్య కేంద్రం నూతన భవనం తుది దశకు చేరింది. విడుదలైన నిధులు తుది దశలో చేపట్టాల్సిన పనుల వద్ద అయిపోవడంతో మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు వెచ్చించాల్సి ఉంది.

అయితే పురపాలక సంఘం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో ప్రభుత్వానికి, సంబంధిత వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖకు నిధులు మరికొంత కేటాయించాలనే ప్రతిపాదనలు పంపించే ఆలోచనలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. నిధులు సరిపోక తుది దశలో చేయాల్సిన పనులు నిలిచిపోయాయి. మరికొంత నిధుల కోసం వేచి చూస్తున్నారు.

వందకుపైగా పరికరాలు రాక..

పట్టణ ఆరోగ్య కేంద్రంలో వినియోగించే అన్ని పనిముట్లతో పాటు కార్యాలయంలో వినియోగించే వస్తువులు, పరికరాలు వీల్‌చైర్లు, ఆయా వైద్య పరీక్షలకు సంబంధించి కిట్లు, బెడ్లు వంటి వస్తువులు సుమారు వందకుపైగా ఏడాది కిందటే సమకూర్చారు. అప్పటి నుంచి వీటిని పాడుబడిన భవనంలో ఉంచారు. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ సామాగ్రి అంతా నూతన భవనంలోని స్టోర్ రూంకు తరలించి భద్రపరిచారు.

రోజుకు 30 మందికి ఓపీ సేవలు



రోజుకు 25 నుంచి 30 మంది వరకు ఓపీకి వస్తున్నారు. ఒక్కోసారి ఈ సంఖ్య 50 దాటుతోంది. ఎక్కువగా జర్వం, వళ్లు నొప్పులు, షుగర్, బీపీ వంటి వాటికి వస్తుంటారు. దెబ్బలు తగిలి ప్రథమ చికిత్స కోసం కూడా వస్తున్నారు. వీరికి చికిత్స చేసి పంపిస్తున్నాం. పెద్ద కేసులు ఏమైనా వస్తే వాటిని మచిలీపట్నం పెద్దాస్పత్రికి రిఫర్ చేస్తున్నాం.

– కె. నిఖిలేష్, వైద్యాధికారి, పట్టణ ఆరోగ్య కేంద్రం, పెడన

నివేదికలు సిద్ధం చేశాం



పట్టణ ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన నిధులు అయిపోయాయి. తుది దశలో చేపట్టాల్సిన కొన్ని పనులు మిగిలిపోయాయి. వీటికి సుమారు రూ.14 లక్షల వరకు ఖర్చు అవుతుందని గుర్తించి నివేదికలను ప్రభుత్వానికి, వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. నిధులు రాగానే మిగిలిన పనులను త్వరితగతిన చేపట్టి ఏప్రిల్ చివరికి పనులు పూర్తి చేస్తాం.

– ఎం. అంజయ్య, కమిషనర్, పురపాలక సంఘం, పెడన

ఆర్‌బీకే భవనానికి భూమి పూజ

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ పంచాయతీ పరిధిలో రైతు భరోసా కేంద్రానికి సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు గురువారం భూమి పూజ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ. 17.50 లక్షలతో పనులు ప్రారంభించామని గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పైడిపాముల ప్రభాకర్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కొల్లిపర రామకోటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి వాకా రవికుమార్, ఉపాధి హామీ పథకం ఏపీఓ సాదుమజ్జు, టెక్నికల్ అసిస్టెంట్ హరిబాబు నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ తూము ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయం

కోనేరుసెంటర్: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భవిష్యత్‌లో సమాజానికి మరిన్ని సేవా కార్యక్రమాలు అందించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె. మోహనరావు అన్నారు. గత నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు గుజరాత్‌లోని సర్దార్ పటేల్ యూనివర్సిటీలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో పాల్గొని తిరిగి కృష్ణా యూనివర్సిటీకి చేరుకున్న విద్యార్థులను శుక్రవారం వీసీ అభినందించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజసేవ అలవడుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలోనూ భాగస్వాములు కావాలని చెప్పారు. ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి ఎం. బాబురెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్ శాంతికృప, స్వరూప, కవిత, గోపి, సుజయ్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



వృద్ధునికి అందుతున్న పింఛన్ వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

అడపావారిపాలెం(మోపిదేవి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. పెదకళ్లేపల్లి శివారు అడపావారిపాలెం, రజాపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శనీయమన్నారు. నీటి సరఫరా సమయం పెంచాలని స్థానికులు కోరారు. త్రీఫేజ్ లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని గ్రామ కార్యదర్శి చెప్పారు. వెంటనే విద్యుత్ శాఖ మండల ఏఈతో ఫోన్‌లో మాట్లాడి త్రీఫేజ్ విద్యుత్‌కు ఎస్టిమేట్ పంపాలని, పంచాయతీ నిధులు లేకుంటే ప్రభుత్వం ద్వారానే నిధులు చెల్లిస్తామని చెప్పారు. శ్మశానవాటిక సమస్య కూడా పరిష్కరించాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ పండలనేని అన్నపూర్ణ ఆర్థిక సాయంలో నోట్ పుస్తకాలు తీసుకువచ్చి ఇంటింటా విద్యార్థులకు అందజేశారు. తొలుత స్థానిక ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. పీఏసీఎస్ కేంద్రం ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, పండలనేని శివప్రసాద్, గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు, సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రెడ్రొతు వెంకట రమణ, నాయకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

అవగాహన కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది



కోడూరు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెడన: లింగ వివక్షత, లింగ నిర్ధారణ పరీక్షలు వంటివి చట్టరీత్యా నేరమని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యాధికారులు, సిబ్బంది బలిపర్రు గురుకుల పాఠశాలలో, నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో లింగ వివక్షపై అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. లింగనిర్ధారణ పరీక్షలు చేయడం ఎంత నేరమో తెలిసి కూడా చెప్పకపోవడం అంతే నేరమని వైద్య సిబ్బంది చెప్పారు. చేవేంద్రపాలెం పీహెచ్‌సీ పరిధిలో చేవేంద్ర జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది లీలాకుమార్, ఎం. వీరయ్య, సీహెచ్ఓ కుమారి, పాఠశాలల హెచ్ఎం, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలే మానవ జాతికి మూలం..

కోడూరు: ఆడపిల్లలే మానవ జాతికి మూలమని, వీరిని లింగ నిర్ధారణ ద్వారా తల్లి కడుపులోనే చంపేయడం హేయమైన చర్య అని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరు–3 సచివాలయ పరిధిలో గురువారం జరిగిన బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తల్లి గర్భంలో ఉండగా లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, వీటిపై గ్రామ స్థాయిలో కూడా ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రమేష్‌బాబు అన్నారు. ప్రస్తుతం బాలురతో పాటు బాలికలు కూడా ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారన్నారు. బాలికలకు విద్యను అందించి, వారికి కూడా సమాజంలో సముచిత స్థానం కల్పించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని చెప్పారు. అనంతరం వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, ఎంఈఓ టీవీఎం రామదాసు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన..

కోనేరుసెంటర్: మండల పరిధిలోని చిన్నాపురం, గుండుపాలెం, పోలాటితిప్ప, కోన గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గర్భస్థపిండ నిరోధక చట్టం 1994పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి పీవీ పరమేశ్వరరావు మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్ష, స్కానింగ్ పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధమన్నారు. చట్టాన్ని అతిక్రమించి ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు సాహసించినా, ప్రోత్సహించినా మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలుశిక్షతో పాటు రూ. 50వేల నుంచి లక్ష వరకు జరిమానా విధిస్తారన్నారు. పీహెచ్ఎన్ సీహెచ్ వి వసుంధరదేవి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఏపీలో సంక్షేమ పథకాల అమలు భేష్

- గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచి సేవలు అందుతున్నాయి
- జర్మనీ అల్టెన్స్‌బర్గ్ మాజీ మేయర్ గుజ్జుల రవీంద్ర
- విలేజ్ క్లినిక్‌లు, నాడు–నేడు, సచివాలయ వ్యవస్థకు ప్రశంసలు



గుజ్జుల రవీంద్రకు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు బాగా ఉపయోగ పడుతున్నాయని జర్మనీలోని ఆల్టెలాండ్స్‌బర్గ్ మాజీ మేయర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గుజ్జుల రవీంద్ర అన్నారు. గురువారం ఆయన నాగాయలంక మండలంలోని తలగడదీవిలో పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుని అవనిగడ్డలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్యే సింహాద్రి జర్మనీ బృందానికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న పలు సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే రమేష్ బాబు గుజ్జుల రవీంద్రకు వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య, నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, గ్రామ సచివాలయ వ్యవస్థ, విలేజ్ క్లినిక్‌ల గురించి తెలుసుకున్న ఆయన ప్రశంసించారు. మూడు రాజధానులు, పరిపాలన, పారిశ్రామిక ప్రగతిపై మాజీ మేయర్ రవీంద్ర ఎమ్మెల్యే సింహాద్రిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఈ కార్యక్రమాల వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా పలు సేవలు అందుతున్నాయని చెప్పారు. ఆల్టెలాండ్స్‌బర్గ్ ప్రజల సహాయంతో సునామీ అనంతరం దివిసీమతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పలుచోట్ల రూ.7.22 కోట్ల విలువైన అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. దివిసీమ అభివృద్ధికి భవిష్యత్‌లోనూ సహకారం అందిస్తామని రవీంద్ర వెల్లడించారు. సీఎం జగన్ పాలన బాగుందని ప్రజలు చెప్పుకుంటున్నారని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలని ప్రజల అభీష్టంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర బృందానికి ఎమ్మెల్యే సింహాద్రి, ఆయన సతీమణి కెప్టెన్ లక్ష్మీ తేనీటి విందు ఇచ్చారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ నేత ఉప్పాల రాము, ఎంపీపీ తుంగల సుమతీదేవి పాల్గొన్నారు.

తెలుగు ప్రజలకు సేవ చేయడం సంతృప్తినిచ్చింది..

అవనిగడ్డ: జర్మనీలోని ఆల్టెలాండ్స్‌బర్గ్ ప్రజల సహకారంతో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని డాక్టర్ గుజ్జుల రవీంద్ర అన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో రవీంద్ర బృందాన్ని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ గురువారం ఘనంగా సత్కరించారు. రక్తదాన శిబిరాలు నిర్వహించిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు యాసం చిట్టిబాబుని రవీంద్ర, బుద్ధప్రసాద్ సత్కరించారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కిట్టు జన్మదిన వేడుక గురువారం జరిగాయి. కిట్టు ఫ్రెండ్స్ సర్కిల్, పోతురాజు భార్గవ్ ఆధ్వర్యంలో మాచవరంలో రక్తదానం చేశారు. నాయకుడు అనిశెట్టి ధనుంజయ ఆధ్వర్యంలో ఈడేపల్లి వృద్ధాశ్రమంతో పాటు పలు వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేశారు. దేశాయిపేట సున్నపుబట్టీల ప్రాంతంలో వృద్ధులకు చీలి రవీంద్ర ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. మేయర్ చాంబర్‌లో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ కార్పొరేటర్లతో కలిసి కేక్ కట్ చేశారు. 47వ డివిజన్ కన్వీనర్ హర్ష ఆధ్వర్యంలో రుస్తుంబాద మునిసిపల్ స్కూల్ విద్యార్థులకు జామెంట్రీబాక్సులు, పుస్తకాలను మేయర్ అందజేశారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రవిశాస్త్రి, నగర పాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి ఆధ్వర్యంలో తాళ్లపాలెం స్నేహాలయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, పండ్లు, టవల్స్ అందజేశారు.

● ఉత్సాహంగా బాలోత్సవ్



సభలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, చిత్రంలో ఎమ్మెల్యే సింహాద్రి



నరసింహస్వామి రూపంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలోత్సవ్ వేడుకలు అంబరాన్నంటాయి. మండలంలోని 40 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. – కోడూరు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు: 33 కేవీ విద్యుత్ లైన్ నిర్వహణ, మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మచిలీపట్నం ఈఈ ఎం.భాస్కరరావు తెలిపారు. ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు గూడూరు మండలం మొత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చల్లపల్లి చేరిన పాదయాత్ర

చల్లపల్లి: ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని మందా కృష్ణ మాదిగ 29 సంవత్సరాలుగా చేస్తున్న పోరాటం నేపథ్యంలో బీజేపీ 2014 ఎన్నికల ముందు నుంచి ఇస్తున్న హామీని తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోరుతూ మాదిగల సంగ్రామ యాత్రను పురస్కరించుకుని చేపట్టిన పాదయాత్ర గురువారం చల్లపల్లి చేరుకుంది. స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎలీషా మాట్లాడారు. మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ కొల్లూరి బసవ, ఎంఎస్‌పీ నియోజకవర్గ కన్వీనర్ కొక్కిలిగడ్డ నవీన్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదుకు రేపటి వరకు గడువు

పెడన: రబీ పంటకు సంబంధించి రైతులు తాము వేసిన వరి, మినుము, పెసర తదితర పంటలను ఈ క్రాప్, ఈకేవైసీ ఈనెల 4వ తేదీలోగా చేయించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మనోహరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరితో గడువు ముగిసినా మార్చి 4వ తేదీ వరకు గడువు పొడిగించారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

95 శాతం పెన్షన్ల పంపిణీ

గూడూరు: గూడూరు మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ 95శాతం పూర్తయిందని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. మండలంలో 8,282 సామాజిక పెన్షన్లు ఉండగా గురువారం సాయంత్రానికి 7,870 మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛను సొమ్ము పంపిణీ చేశారని వివరించారు.

నగరంలో 96.66 శాతం అందజేత

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ రెండో రోజు గురువారం 96.66 శాతం పూర్తయింది. నగరంలో మొత్తం 18,690 మంది పింఛనుదారులు ఉండగా 18,066 మందికి గురువారం సాయంత్రం వరకు పంపిణీ చేశారు. ఇంకా 624 మంది పింఛనుదారులకు పింఛను అందజేస్తే నూరు శాతం పూర్తవుతుంది.

గుంటూరు ఆస్పత్రికి వెళ్లి పింఛను పంపిణీ

మచిలీపట్నంటౌన్: 32వ డివిజన్‌కు చెందిన చిటికిన రజని అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న 32వ డివిజన్ వలంటీర్ దీప్తి గురువారం గుంటూరు ఆస్పత్రికి వెళ్లి పింఛను సొమ్మును అందజేసింది. వలంటీర్ దీప్తిని కార్పొరేటర్ చింతా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్లు చింతా మౌనిక, చీలి రవీంద్ర తదితరులు అభినందించారు.

చెత్త నుంచి సంపద తయారు చేయాలి

అడ్డాడ(పామర్రు): గ్రామ పంచాయతీల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్డీ ఏ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని అడ్డాడ, పెదమద్దాలి గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో సంపద కేంద్రాలను, వ్యక్తిగత మురుగు దొడ్లనిర్మాణాల పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో మంజూరైన వ్యక్తి గత మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆర్ సుబ్రమణ్యేశ్వరరావు, స్థానికులు పామర్తి వెంకట్ పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: స్థానిక గొడుగుపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం మూలవర్లకు పంచామృత స్నపన, సాయంత్రం ధ్వజపట గ్రామోత్సవం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీ గోపాలరావు పర్యవేక్షించారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసన



మచిలీపట్నంటౌన్: కేంద్ర ప్రభుత్వం పేదలను కొట్టి పెద్దలకు పెడుతోందని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నరసింహారావు విమర్శించారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపునకు వ్యతిరేకంగా గురువారం స్థానిక బుట్టాయిపేట సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పలురకాల పన్నులతో పేదల నడ్డి విరుస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో రూ. 450 ఉన్న గ్యాస్ ధరను రూ. 1175లకు పెంచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు కొడాలి శర్మ, బూర సుబ్రహ్మణ్యం, మాదాల వెంకటేశ్వరరావు, కేవీ గోపాలరావు, టి చంద్రపాల్ పాల్గొన్నారు.